# ఉద్యోగం

## శ్రీ వి.వి. సత్యనారాయణ మూర్తి

హడావుడిగా పరుగులాంటి నడకతో బస్‌స్టాపు చేరుకున్నాడు సుందరం. నీట్‌గా డ్రస్ చేసుకున్నాడు. ఆరోజే షేవ్ చేసిన గెడ్డం ఆకుపచ్చగా మెరుస్తోంది. చేతిలో సర్టిఫికెట్స్ వున్న ఫైలు. కాస్తంత కామన్‌సెన్స్ వున్నవాళ్ళు ఎవరైనా సుందరాన్ని చూడగానే ఇట్టే గ్రహిస్తారు అతడు వెళ్ళేది ఇంటర్‌వ్యూకి అని.

అప్పటికే ఓ పదిమంది పాసెంజర్లు సిటీబస్సు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పదిమందికి కొద్దిగా దూరంగా నిలబడి వుందో అమ్మాయి. మరీ అంత ఖరీదైన చీరకాదు అలాగని చవకబారు చీరకూడా కాదు. ఏదో వుండీలేక బ్రతికే మధ్యతరగతి అమ్మాయిలు కట్టుకునే సాదాచీర కట్టుకుంది ఆమె. చూడగానే మంచి అమ్మాయి అనిపిస్తోంది.

"భవానీ టెక్స్‌టైల్స్'కు వెళ్ళడానికి ఎన్నో నెంబరు సిటీబస్ ఎక్కాలండీ" ప్రక్కనున్న పెద్ద మనిషిని అడిగాడు సుందరం.

"నాకు తెలియదు బాబు. నేనుకూడా ఈ ఊరికి క్రొత్త" అన్నాడాయన.

సుందరం మరొకఆయనను అడుగుదామని అనుకున్నాడు. ఈలోగా ఏదో సిటీబస్ వచ్చింది. జనం ఈగల్లా దానిమీద పడ్డారు. ఆ సందడిలో తాను అడగడం అనవసరమనుకొని చుట్టుచూసాడు.

ఒకప్రక్కగా నిలబడ్డ ఆ అమ్మాయి సుందరం దృష్టిని ఆకర్షించింది. ఆమె సిటీబస్ ఎక్కుతున్నట్లు లేదు. బహుశా ఆమె ఎక్కవలసిన బస్ అదికాదేమో అనుకొని ఆమెను సమీపించాడు.

ఆమె వైపు నాలుగు అడుగులు వేసాడోలేదో ఎటో చూస్తున్న ఆమె సుందరంవైపు తలతిప్పింది. ఆడవారితో మాట్లాడాలి అంటే సుందరానికి సిగ్గు. పైగా ఆమె సుందరంవైపు చూస్తు చిరునవ్వు నవ్వడంతో మరింత మెలికలు తిరిగిపోతూ "ఏమండీ! భవానీ టెక్స్‌టైల్స్‌కు వెళ్లడానికి ఏ నెంబరు సిటీబస్ ఎక్కాలి" అన్నాడు.

ఆమె ముఖంలో నవ్వు చెదరనీయకుండా "పదమూడవ నెంబరు బస్ ఎక్కాలి" అన్నది.

"థాంక్స్ అండి" అన్నాడు సుందరం బిడియంగా.

ఆమె నోమెన్షన్ చెప్పలేదు. నవ్వి ఊరుకుంది.

ఓ పది నిముషాలలో పదమూడవ నెంబర్ బస్ రావడం సుందరం దాన్ని ఎక్కి ఇంటర్‌వ్యూకి అటెండ్ కావడం యాంత్రికంగా జరిగిపోయాయి.

జరిగిపోయిన ఇంటర్‌వ్యూని నెమరువేసుకుంటూ అది అలా చెబితే బాగుండేది ఇలా చెబితే బాగుండేది, చాలా ప్రశ్నలు బాగానే ఆన్సర్ చేసాను అనుకుంటూ తిరుగుముఖం పట్టి సరిగ్గా తాను ఇంతకముందు ఎక్కిన బస్‌స్టాప్ దగ్గర బస్ దిగాడు సుందరం.

చేతిలోని ఫైల్‌ను సరిచేసుకుని ముందుకు నడవబోయి ఆగిపోయాడు. ప్రొద్దున్న తనకు కనపడిన అమ్మాయి అదేస్థానంలో నిలబడివుంది. అప్పటినుండి ఆమె ఎక్కవలసిన బస్ రాలేదా అనుకున్నాడు.

ఒక్కక్షణం ఆశ్చర్యం వేసింది సుందరానికి. కొంపతీసి ఈ అమ్మాయి పిచ్చిది కాదుగదా ప్రొద్దున్ననుండి అలాగే వుండిపోయింది అనుకున్నాడు స్వగతంగా. అంతలోనే తన ఆలోచనకు తిట్టుకొని పిచ్చిదయితే కరెక్టు ఎడ్రెస్ చెప్పివుండదుకదా అనుకున్నాడు.

ఈలోగా ఆ అమ్మాయి నవ్వుతూ సుందరాన్ని సమీపించింది. "ఇంటర్వ్యూ బాగా జరిగిందా" అని ప్రశ్నించింది.

ఆమె ఎవరు, ఎందుకలా నిలబడివుంది అనే ఆలోచనలనుండి బయటపడి "ఆ.. ఆ... బాగానే చేసాను" అన్నాడు.

ఆమె ముఖంలో ఏదో సంతోషం.

సుందరం వెళ్లొస్తాను అన్నట్లు ఆమె వంకచూసి నడిచి వెళ్ళిపోయాడు.

ఒకటి రెండురోజులు ఆమె గురించి అప్పుడప్పుడు ఆలోచించాడు సుందరం. మరో నాలుగురోజులు గడిచేసరికి ఆమె సంగతి పూర్తిగా మరిచిపోయాడు.

మీరు సెలక్ట్ అయినదీ లేనిదీ వారం రోజులలో ఇంటిమేషన్ పంపుతామని భవానీ టెక్స్‌టైల్స్ ఎమ్.డి గారు పెట్టిన గడువు పూర్తికావడంతో ఆ ఉద్యోగం తనకు రాలేదని నిర్ణయించుకున్నాడు.

మరల ఉద్యోగ ప్రయత్నం. ఈసారి 'హిందూ ఫార్మాస్యూటికల్ కంపెనీలో ఇంటర్వ్యూ. మరలా నీట్‌గా తయారయి ఇంటర్వ్యూ టైమ్‌కి రెండుగంటలు ముందుగా బస్‌స్టాపు చేరుకున్నాడు.

తాను ఈ భాగ్యనగరానికి కొత్తవాడు అవడంవలన ఎక్కడికి వెళ్ళాలన్నా ఎవరో ఒకరిని అడిగి తెలుసుకోవలసి వస్తోంది. తనలాగే బస్‌కోసం నిలబడ్డ వ్యక్తిని అడగాలనుకున్నాడు. ఇంతలో వీరికి కొంతదూరంగా నిలబడివున్న ఆ అమ్మాయి కనపడింది.

అదే అమ్మాయి అదేస్థానంలో అదే టైముకి కనపడడం ఏక్సిడెంటల్‌గా జరిగిందా అనుకున్నాడు సుందరం.

ఈలోగా ఆ అమ్మాయే నవ్వుతూ సుందరం వైపు అడుగులు వేసింది. దగ్గరకు రాగానే 'మరలా ఇంటర్వ్యూ?' అని అడిగింది.

అవునన్నట్లు తల ఊపాడు సుందరం.

"ఏ కంపెనీ?"

"హిందూ ఫార్మాస్యూటికల్ కంపెనీ"

"నాలుగో నెంబరు సిటీబస్ ఎక్కండి" సుందరం అడగకుండానే చెప్పింది ఆమె.


"థాంక్స్" కృతజ్ఞతగా చూస్తు అన్నాడు సుందరం.

**మూడు గంటల తరువాత ఇంటర్‌వ్యూ ముగించుకొని అదే బస్‌స్టాపులో దిగాడు సుందరం. దిగిన వెంటనే ఇంతకుముందులాగా ఆ అమ్మాయి అక్కడే నిలబడి వుందేమో అని చూసాడు. కాని ఆమె అక్కడ లేదు.**

ఆమె నోమెన్షన్ చెప్పలేదు. నవ్వి ఊరుకుంది.

మూడుగంటల తర్వాత ఇంటర్వ్యూ ముగించుకొని అదే బస్‌స్టాపులో దిగాడు సుందరం. దిగిన వెంటనే ఇంతకుముందులాగా ఆ అమ్మాయి అక్కడే నిలబడి వుందేమో అని చూసాడు. కాని ఆమె అక్కడలేదు. తన ఆలోచనకు తనలో తానె నవ్వుకున్నాడు.

వుద్యోగం వస్తుందనే ఆశాదీపం వెలుగులు మనసునిండా నింపుకొని ఇంటివైపు నడిచాడు సుందరం.



మూడురోజులు తిరక్కుండానే మీరు సెలక్ట్‌కాలేదని తెలుపుటకు విచారిస్తున్నామని హిందూ ఫార్మాస్యూటికల్స్ నుండి రిగ్రెట్ లెటరు అందడంతో మరలా ఉద్యోగ ప్రయత్నం మొదలుపెట్టాడు.

అలా ప్రయత్నాల పరంపరలలో రెండునెలలు గిర్రున తిరిగిపోయాయి. ఇంటర్వ్యూలకి వెళ్ళేముందు మదినిండా ఆశలు నింపుకోవడం సెలక్ట్ కాలేదని తెలిసినపుడు బాధపడడం బాగా అలవాటయింది సుందరానికి. ఇంటర్వ్యూలకి వెళుతున్న ప్రతిసారి ఆ అమ్మాయి అదేస్థానంలో నిలబడి కనబడుతోంది. కనపడిన ప్రతిసారి ఆమె పలకరింపుగా నవ్వుతోంది. ఆమె ఎవరు అనే ప్రశ్న మెదడులో కదులుతోందిగాని అడిగి తెలుసుకోవాలని పించలేదు.

ఈ మధ్యకాలంలో మాత్రం సుందరానికి రెండు విషయాలపట్ల నమ్మకాన్ని పెంచాయి. ఒకటి లంచం, రికమండేషన్ లేకుండా ఉద్యోగంరాదని. రెండవది తాను నవగ్రహాలలో ఒకటైన శనిగ్రహం బంధువునని.

ఈ రెండు విషయాలపట్ల రోజురోజుకు నమ్మకం పెరిగిపోవడంతో ఇంక భాగ్యనగరంతో బాకీచెల్లు అయిపోయిందనుకొని తెచ్చుకొన్న నాలుగుబట్టలు ఎయిర్‌బాగ్‌లో కుక్కుకుని ఫైలు చేత్తోపట్టుకొని అప్పటివరకూ తనకు ఆశ్రయమిచ్చిన ప్రాణస్నేహితుడితో 'నీకు బాగా ఋణపడ్డామురా. నీ ఋణం తీర్చుకోలేనిది' అని చెప్పి సెలవు తీసుకొని బస్‌స్టాపు వైపు నడిచాడు.

రైల్వే స్టేషన్‌కి ఏ నెంబర్‌బస్ వెళుతుందో తెలుసు. కాబట్టి ఎవరినీ అడగకుండానే బస్ కోసం ఎదురు చూస్తూ నిలబడ్డాడు. తాను ఎలాగూ ఈ ఊరువదిలి వెళ్లిపోతున్నాడు. వెళ్లేముందు ఆమె ఎవరు. ఎందుకు అలా బస్‌స్టాపులో నిలబడి వుంటుంది అనే సందేహం తీర్చుకోవాలనిపించింది సుందరానికి.

ఆమె ఎప్పుడూ నిలబడి వుండే ప్రదేశంలో చూసాడు. ఇదివరకు తాను ఎప్పుడు చూసినా అదేస్థానంలో నిలబడివుండేది. కాని ఇప్పుడు లేదు. తన సందేహం తీర్చుకోకుండానే వెళ్ళవలసి వస్తుందనుకున్నాడు.

ఈలోగా స్టేషన్‌కి వెళ్ళే బస్ వచ్చింది. ఎందుకో వెంటనే ఎక్కాలనిపించలేదు. ఎలాగూ స్టేషన్ వెళ్ళే బస్‌లు చాలా వున్నాయి, మరికొంతసేపు వెయిట్‌చేసి ఆమెను పలకరించి వెళ్ళాలనిపించింది.

సుందరం ఆట్టేసేపు నిరీక్షించకుండానే ఆమె బస్‌స్టాపులోకి వచ్చి నిలబడింది. వచ్చినవెంటనే అక్కడ నిలబడ్డ వారినందరిని ఒకసారి పరిశీలించింది. అందరితోపాటు సుందరాన్ని కూడా గమనించింది ఆమె.

సుందరం కనపడగానే పలకరింపుగా నవ్వింది ఆమె. బలవంతంగా నవ్వుతున్న మాదిరి పెదవులు విరిచాడు సుందరం.

నలిగినబట్టలు, పెరిగినగడ్డం, నిరాశనిండిన ముఖం చూడగానే భృకుటి ముడివేసింది ఆమె. నెమ్మదిగా

అడుగులువేస్తూ సుందరాన్ని సమీపించింది.

'మీ ఊరు వెళ్ళిపోతున్నారా?"

"ఊ! అయినా మీకెలా తెలుసు" ఆశ్చర్యంగా అడిగాడు సుందరం.

"కొన్ని విషయాలు కొంతమందికి బాగా తెలుస్తాయి. అది సరే, మీకు ఏవీ ఉద్యోగం దొరకలేదా" నిర్లిప్తంగా అడిగింది ఆమె.

"దొరకలేదు. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇంక దొరకదు కూడాను" దృఢంగానూ బాధగానూ అన్నాడు సుందరం.

ఆమె నవ్వింది.

"మీ ఊరు వెళ్ళి ఏం చేద్దామనుకుంటున్నారు?"

"ఏ కూలిపనో చేయాలి. సొంతంగా వ్యాపారం పెడదామన్నా చేతిలో డబ్బులేదు"

కొంతసేపు మౌనం ఇద్దరిమధ్య.

ఆమె ఎవరు, పేరు ఏమిటి అని అడగాలని వుంది. కాని ఛాన్స్ దొరకడంలేదు. ఆమె ఏదో ఒకటి మాట్లాడుతోంది.

ఆమె బరువుగా కనురెప్పలు ఎత్తి "సరే! మీకో ఉద్యోగం ఇస్తాను చేస్తారా?" అంది తాపీగా.

తాను వింటున్నది నిజమా లేక ఆ మాటలు కోసం ఎదురుచూసిన తనకు అలా భ్రమ కలిగిందా అనుకున్నాడు సుందరం.

సుందరం నుండి ఎటువంటి సమాధానం రాకపోవడంతో తన మాటలు సరిగా వినపడ్డాయోలేదో అనుకొని మరలా చెప్పింది.

ఈసారి కలకాదు నిజమే అనుకొని నోట్లోంచి మాటలు రాక 'చేస్తాను' అన్నట్లు తల ఊపాడు ఆమెను ఓ దేవతలా భావిస్తూ. ఒక నిముషం తరువాత అడిగాడు 'మీ పేరేమిటి?' అని

'కళావతి' నవ్వుతూ చెప్పింది ఆమె.

ఎందుకోగాని వినసొంపుగా అనిపించలేదు సుందరానికి.

"ఆ హోటల్‌కి వెళ్ళి మాట్లాడుకుందాం రండి అంటూ బస్‌స్టాపు మెట్టుదిగి రోడ్డుమీదకు నడిచింది ఆమె.

సుందరం బుద్ధిమంతుడిలా ఆమెను అనుసరించాడు.

హోటల్‌లోని ఫామిలీరూంలోని ఒక టేబుల్‌ముందు కూర్చున్నారు కళావతి, సుందరం.

"రెండు నెలలుగా చూస్తున్నారు నన్ను. నా గురించి ఏమనుకుంటున్నారు?" సూటిగా ప్రశ్నించింది కళావతి.

"నేను మిమ్మల్ని గమనిస్తున్న మాట నిజమే. అప్పుడప్పుడు మీరు ఎవరు, ఎందుకలా బస్‌స్టాపులో నిలబడతారని తెలుసుకోవాలని పించింది. కాని నా ఉద్యోగ ప్రయత్నాలు, వాటికి సంబంధించిన విషయాలు ఆలోచించడంలో దానికి అంత ప్రాముఖ్యత ఇచ్చేవాడిని కాదు. నిజానికి ఈ రోజు మీ గురించి తెలుసుకోవాలని పించింది. విషయం అడుగుదామని అనుకుంటుండగా మీరె పలకరించారు" అన్నాడు సుందరం.

ఈలోగా వెయిటర్ వచ్చి 'ఏం కావాలి సర్!' అన్నాడు వినయంగా.

"రెండు టీ" కళావతి చెప్పింది.

వెయిటర్ తల ఊపి టీ కోసం వెళ్ళాడు.

కళావతి ఓసారి భారంగా నిట్టూర్చి "వ్యభిచారులపైన మీ అభిప్రాయం ఏమిటి?" తలవంచుకుని అడిగింది కళావతి.

సుందరానికి లీలగా ఆమె ఎవరో అర్థమవుతున్నట్లు అనిపించింది.

"నిధివంచితులు. ఈ లోకంలో వున్నమొత్తం జాలి, దయలలో సగం వారిమీద చూపించాలి" అన్నాడు.

ఆ సదభిప్రాయానికి సంతోషించింది కళావతి.

"నేను వ్యభిచారిని. ఈ వృత్తిలోకి దిగి ఎంతోకాలం అవలేదు. కాని జరిగిపోయిన కొద్దికాలం నాకు అనేక విషయాలు నేర్పింది. ఇప్పుడు మీకు ఉద్యోగం ఇస్తాను అని అనగలిగానంటే ఆ అనుభవమే కారణం. సరే అసలు విషయానికి వస్తాను. ఇప్పుడు నేను చెప్పబోయే ఉద్యోగం మీకు నచ్చితేనే చేయండి. లేదా హాయిగా ఇంటికి వెళ్లిపోండి... అని ఏదో చెప్పబోయింది. వెయిటర్ 'టీ'లు తీసుకువచ్చాడు.

కళావతి మాటలు ఆపేసింది. అతను వెళ్ళిపోయాక మరలా చెప్పడం మొదలుపెట్టింది.

"ఈ వ్యభిచారం చేసే చాలా వారిలో ఇంగిత జ్ఞానం వుండదు. అలాంటి వారు అవకాశం వస్తే పక్కా వ్యభిచారిని వదిలి పక్కవాడి భార్యను వాడుకుందామని చూస్తాడు. ఇప్పుడు దానివలన నాకేమిటి నష్టంగాని లాభంగాని అంటారా. మీ ఉద్యోగానికి బేసిక్ ఆ పాయింటే. నా భర్తగా మీకు ఉద్యోగం ఇస్తాను. మీరు బయటి ప్రపంచానికి మాత్రమే నా భర్త. సంసారం చేసే స్త్రీ అంటే వందలుకాదు, వేలు అయినా ఖర్చుచేసి సుఖం కోరుకుంటారు. నిజ జీవితంలో మీరు ఏ ఉద్యోగం చేయాలని ఆశపడ్డారో చెప్పండి. ఆ ఉద్యోగం మీరు చేస్తున్నట్లు నలుగురికీ గొప్పగా చెబుతాను. ఈ అబద్ధం కూడా నా వ్యాపారాన్ని పెంచుతుందనుకోండి. నేను సంపాదించినదాంట్లో మీకు సగం, నాకు సగం" అన్నది కళావతి.

తన కళ్ళముందున్న టేబులు, తన మనసు, ఆశలు, తల గిర్రున తిరుగుతున్నట్లు అనిపించింది సుందరానికి. రెండునిమిషాల తరువాత మరలా అంది కళావతి.

"మీరు ఉద్యోగిగా మారాలంటే నేను నా వృత్తిలో నిరుద్యోగిగా మారకూడదనుకుంటే ఈ పనిచేయండి" అన్నది కళావతి.

సుందరం కళ్ళల్లో నీళ్ల తిరిగాయి.

కళావతి జాలిగా సుందరం ముఖంలోకి చూసింది.

సుందరం బుగ్గలు మీదుగా కన్నీళ్ళుజారి ఫైలుమీదున్న సుందరం ఎమ్.ఏ అనే అక్షరాలలో ఎమ్.ఏ మీద పడ్డాయి. అక్షరాలు చెరిగిపోయాయి.

కళావతి చొరవగా సుందరం చేతిని చేతిలోకి తీసుకుంది. చీర కొంగుతో కన్నీళ్ళు తుడిచింది.

నేను ఈ కన్నీళ్ళ పర్వాన్ని దాటాను అన్నట్లు ఎప్పటిలాగే నవ్వుతూ చూసింది సుందరం వంక.

*



### కావాలి

"ప్రేమించమన్నావ్? ప్రేమించాను. పెళ్ళి చేసుకోమన్నావ్! చేసుకున్నాను. ఆస్తి నీ పేర రాయమన్నావ్! రాసాను మరి ఇంకా ఏం కావాలి?" కోపంగా అడిగాడు చిదానందం, సరోజని.

"విడాకులు" నింపాదిగా చెప్పింది సరోజ.

—ఈమని శ్రీనివాస్
(వినుకొండ)

### దండగ

